# "విహాటింగు ముగిసింది"

మణుం బంగారానికన్నా మాసమెత్తు అధికారం మేలన్నాడు చచ్చి స్వర్గానున్న మహానుభావుడెవడో – తాతయ్యలూ, చిన్నాయనలూ, మామయ్యలూ వగైరాలంతా పెద్దపెద్ద అధికార్లే గనక వారసత్వంగా నాకు కూడా పెద్ద నౌకరీయే దొరికింది. అందరివలే కాకుండా చదువుకున్న నాటి కలలు కల్లలుగాలేదు. మూడు పూలూ, ఆరు కాయలుగా పుష్పించడమేమిటి ఖర్మ బాగా ఫలించాయి. హైదరాబాద్ సివిల్ సర్వీస్‌లో సెలక్టయ్యాను. నా పేరు వెనక H. C. S. అన్న తోక పెరిగింది. అంతే పూర్తి హైదరాబాద్ సంస్థానాన్నే ఏమిటి? ప్రపంచాన్నే జయించినంత విలువ. ఐ. సి. యస్. కు ఇంగ్లాండు దాకా పోవాలి. నానా పాట్లు పడాలి. కాని మాకా కష్టాలూ, సీతమ్మ చెరలూ అనుభవించాల్సిన అవసరంలేదు. ఇంటర్ పాసవుతే చాలు. వెనకా ముందూ జుట్టు పట్టి లాగే దిక్కు మాత్రం చాలా ముఖ్యం. అందులో కట్టుకున్న పెండ్లాం తండ్రి లాంటి వాడుంటే H. C. S. నూటికి నూరుపాళ్ళు గ్యారంటీ –

మన కథ యెక్కడ నుంచి మొదలైతుందంటే ధాన్యం లేవీ వసూళ్ళల్లో మంచి పేరు (ప్రజల్లో ననుకునేరు సుమా కొంప దీసి) సంపాయించు కున్నాను – రెండు మూడు చోట్ల ఫైరింగులదాకా వ్యవహారం వెళ్ళింది. ఫలితంగా నాకు ప్రమోషన్ వచ్చింది. అందరికన్న ముందే అవ్వల్ తాలుక్దారీ (కలెక్టర్) దొరికింది. ధాన్యంలేవీ, ఖుష్‌ఖరీదీ పేరిట వుండే జబర్దస్తీలు చిరకాలం వర్ధిల్లాలి. వీటి తల్లికడుపు చల్లగుండ – శీతలిన మంత్రజపం పునశ్చరణ కన్నా యెక్కువ ఫలితాల నిస్తున్నాయి. ఇదంతా పాడుగొడవ సర్కారు నౌకర్ని నాకెందుకూ ? కాలాలు ఛండాలంగా వున్నాయి.

ఆనాడు శుక్రవారం శలవురోజు. దొరాబోయి మూడు రోజులైంది. ఇంటిని మరిపించే యేర్పాట్లుచేసే వాళ్లు చేస్తారు. కాని పోయినచోట అలాంటి యేర్పాట్లేమీ జరగలేదు. ఆనాడే వచ్చాను. ఆవురావురు మంటూ అన్నం వేళకు టేబుల్ వద్దకు వెళ్ళాను. యెప్పటిలాగా బిర్యానీ, పొలావు, షోర్బా వగైరాలు లేవు - వాసనచూడటానికైనా మాంసం ముక్క లేకుండా ఉత్త బాపన కూడు బెట్టిన బావర్చీ (వంటవాడు) పైన యెక్కడలేని కోపం వచ్చింది. చెడా బడా దొబ్బులు బెట్టడమేగాక ఉప్పు కారం వంటకాలు వాడి కండ్లకు గురిబెట్టి కొట్టాను. టేబుల్ మీది సామానులన్నీ కింది మీదకి విసిరెయ్యడమేగాకుండా మీదబడి యెన్ని దెబ్బలు గొట్టానో నాకే జ్ఞాపకంలేదు. ఈ హంగామాను చేసుకొన్న పెళ్ళాంకూడా భరిస్తుందో లేదో అనుమానమే. కాని వీళ్ళు భరిస్తారు. ముత్తాతల కాలంనుండి బంగళావై బావర్చీలుగా వుంటున్నారట వీళ్ళ వంశంవాళ్ళు. వదులుకుంటేఇంకే పనికీ పనికిరాడు కనక తన్నినా కుక్కలాగ పడివుంటాడు. అదే వాడి హోదా - జిల్లాకు సర్వతంత్ర స్వతంత్రాధికారాలు గలిగిన అధికారికి వాడు బెట్టిందాకా అన్నం దొరకదు. తిండికి ఠికాణాలేదు. ఇదేనేమో వాడి ఆత్మసంతృప్తి-అసలు వంటవాళ్ళకు డబ్బిచ్చిపెట్టాల్సిన అవసరం మా అధికార్లకెప్పుడూవుండదు - బాగా వంట చెయ్యొచ్చిన చెప్రాసి వెధ వోడుంటాడు. తరతరాలు గడిచినా వాడక్కడే వుంటూ వుంటాడు.

అన్నం మీద అలిగిపోయి అవతల ఆఫీసులో కూచున్నాను. ఇంకా కోపం చల్లారలేదు. బావర్చీ ఉద్యోగం ఊడబీకేయాల్సిందని ఆర్డరు వేశాను. జవాబు చెప్పుకొనే అవకాశం ఇవ్వాల్సిన అవసరంలేదు. పిల్ల పిల్ల తరం ఉద్యోగానికి పనికిరాని వాళ్ళనీ, నమ్మరాని వాళ్ళనీ రాసి పారేశాను. ఆ దినం కోపంలో యెంతమంది పనులు పాడైనాయో, యెంతమంది కూట్లో మన్నుబడిందో ? కలం యెంత కాలకూట విషాన్ని కక్కిందో ?

కోపం చల్లారిందన్న నమ్మకం కలిగాక దేవేరిగారు వచ్చారు. సంగతులు వివరించాక తేలిన సంగతేమిటంటే, మాంసం ధర కంట్రోలు చేసిన సర్కారు, జంతువుల ధర కంట్రోలు చేయలేకపోయిందట. గిట్టు

బాటుగాక కసాయీలు మాంసం అమ్మటం మానుకున్నారట. మూడు దినాలనుండి హర్తాల్ సాగిస్తున్నారట.

అసలు కారణం తెలిశాక వంటవాని మీద వచ్చిన కోపానికి ఆస్కారం కనిపించలేదు. "అరే, వంటవాడి ఉద్యోగం వూడిపోయే ఫైసలా రాశానే ? కరువుకాలం పిల్లలుగల ముండాకొడుకు చచ్చిపోతాడు. మొదట ఆర్డరు చించిపారేశాక వివరాలు మాట్లాడుకుందాం" అని అన్నంతపనీ చేసేశాను.

"యెల్లెట్లా ? మూడు రోజులనుండి హర్తా లవుతుంటే యే పోలీసు రిపోర్టూలేదు. సి. ఐ. డీ. లంతా యే గడ్డిగోస్తున్నట్లు ? ఇంతమందిఉండి యేంజేస్తున్నట్లు ? పనికిరాని మనుషులు" విసుక్కుంటూ గొణిగాను.

మా ఆవిడ నవ్వుతూ అన్నది "ఇదేం అన్నం తింటున్నా, ఆఫీసులోవున్నా, హాయిగా పండుకొనివున్నా మీరూ, మీ పోలీసులూ వున్న పాళంగా పురకడానికి, ఇదేం వెట్టిచాకిరి చేయమన్న విప్లవంకాదు. రామారం రైతుల తిరుగుబాటుకాదు. కనీసం మార్కెటు హమాలీల (కూలీల) హర్తాలుకూడా కాదు."

"ఇంతమంది పబ్లికు బాధపడ్తుంటే యేమన్నమాట ?"

"ఇది పదిమందికి బట్టిన పని. ఏ ఒక్క పెద్దమనిషికి బట్టిన పనో అయితే ఇప్పటికే కొండంత కథ అయిపోయేది."

నా కనిపించింది యే పెద్దమనిషైనా తన రైతులతో రగడా వచ్చినా లేక యేమాత్రం అరికాలికి ముల్లునాటే అవకాశంవున్నా పంటితో బీకెయ్యడానికి ప్రభుత్వ యంత్రాంగమంతా తయ్యారుగా వుంటుంది. పైరవీలు, కార్రవాయీలు, కాయితాలు ఛర్రాలేసిన చక్రాల్లా పరుగెత్తుతాయి. ఇది సర్వసామాన్యం. సహజంగా అర్థం చేసుకోవడం, చెప్పడం అంత ఆరోగ్యకరమైన లక్షణంకాదు అన్న స్పృహ వచ్చింది. వెంటనే అనేశాను.

"ఇదుగో రాజకీయాల్లో దఖలిస్తున్నావు — జాగ్రత్త. నా భార్యవు గాబట్టి దక్కిపోయావు."

"అలాగా? వెంటనే విచారణచేసి ఖైదు ప్రసాదించేవారన్నమాట?" అని వెటకారంగా అన్నది.

"నిన్ను ఖైదులో బెడ్తానా ? మై డియర్" అంటూ బుజ్జగించాను.

కాని. నాలో నాకే అనిపించింది. ఆశ్చర్యం వేసింది. ఇంట్లో భార్యతో మాట్లాడేటప్పుడు కూడా నేను అధికారినన్న సంగతి మరవలేకపోయానే అని.

"అసలు రిపోర్టు రాకపోవడానికి కారణం యేమై వుంటుంది" తెలుసుకోవాలన్న ఆత్రంతో అన్నాను.

"ఇంకా మీ కింది అధికార్లకు ఈ సంగతి తెలిసుండదు."

"నా కివాళిటికైనా తెలిసిందికదా ? మూడు దినాలైనా వాళ్ళకు హర్తాలు సంగతి తెలువలేదంటే ఏమన్న మాట."

"మార్కెటులో కొనుక్కుంటే సంగతులు తెలుస్తాయి. కొనుక్కోకుండానే కోళ్ళు, గొర్లూ వచ్చేవాళ్ళ కెలా తెలుస్తుందండీ ?

మళ్ళీ మా అధికార్ల మీదికి దండెత్తుతుంటే నా మనసుకు కష్టమనిపించింది. ఇంకెవరైనా నా ముందు యిలా మాట్లాడే గుండెలున్నాయా ? ఈవరకేం చేసేవాణ్ణి ? మా వాళ్ళను మేము డిఫెండు చేసుకోకపోతే, మరెవరు చేస్తారు. ఆడవాళ్ళు కూడా ఆడిపోసుకునేటంత చులకనైపోయారు, మా అధికార్లు — చదువుకున్న ఆడవాళ్ళు చాలా ప్రమాదం — నా భార్యకు చదువు చెప్పించినందుకు మా మామగారిపై చాలా కోపం వచ్చింది. పైకంటే యేంకొంప మునుగుతుందోనని మనసులోనే తిట్టుకున్నాను. మాటలు మార్చి వేరే ధోరణిలోకి దించాను. అలా దించడానికి నాకు వంటబట్టిన అమెరికన్ అప్రైడు సైకాలజీనంతా వుపయోగించాను.

# 2

ఆ నాడు ఉత్త పప్పుకూడు దిన్నా నన్న సంగతి (అనధికారంగానే అనుకోండి) అగ్గి లాగా వ్యాపింప జేశాడు మా బావర్చీ. ఇంకేం కొంప లంటుకున్నంత పనై పోయింది. రాయాల్సిన వాళ్ళకు గట్టిగా రాశాను. వాళ్ళింకొకళ్ళకు రాశారు. మురాశిలాలో (గవర్నమెంటు వుత్తరాలు) యెన్నడెరుగని వేగంతో పరుగులు పెట్టాయి. అధికార వర్గాలన్నీ హాజర్, కసాయివాళ్ళను హాజరు పరిచారు. వచ్చిన కటికెవాళ్ళను చూచాక అరికాలు మంట నెత్తి కెక్కింది.

"మాంసమమ్ముకొని బతికేవాళ్ళకు మీకుగూడా హర్తాలు చెయ్యా లనిపించిందేం ? దీని ఫలితం మహా చెడ్డగా వుంటుంది." అని హెచ్చ రించాను.

వాళ్ళు తమ ఘోష చెప్పుకున్నారు. కంట్రోలు ధరకు అమ్మితే యెక్కువున్న జంతువుల ధరకు గిట్టుబాటు కాదని మొత్తుకున్నారు.

"సర్కారు జెప్తున్నారు వినండి యెదురు చెప్పకూడదు. జీ అచ్చా అనాలె. యేదో విధంగా వ్యాపారం చేసుకోవాలె" అని ఆకుకు అంద కుండా, పోకకు పొందకుండా చెప్పారు మా అధికార్లు. యెంత సంజా యించినా వాళ్ళ తల కెక్కడం లేదు. యెక్కువ ధరకుకొన్న ముడి సరకును తయారయ్యాక తక్కువ ధరకు అమ్మమనే ఆర్థిక సూత్రం నాకే బాగనిపించలేదు. ముడిసరుకులు సప్లై చేసే బాధ్యత సర్కారు తీసు కుంటేనే ఇది సాధ్యమేమో ? మా కంట్రోలు ఆర్డరు ఇదేమీ ఆలోచించ లేదేమో ? అయినా ధరకు దొరెవడు ? ధరమీద దొరతనం ఈనాడు సాధ్యమేనా ? అలా చేస్తే మేము, మా సర్కారెక్కడుంటాం ? యేడ్చే వాని కండ్లు తూడ్చినట్లుగా నటించే ఈ కంట్రోలు ఆర్డరు నమలు చేయ డం సాధ్యమా? అర్థశాస్త్రం, రాజకీయ శాస్త్రం,వాటిసూత్రాలు,క్యాపిటలిజం, సోషలిజం వగైరా పెదపెద్ద మాటలు నామనోనేత్రం ముందు గిరగిరా తిరిగాయి.

"చిన్నా పెద్దా లేకుండా అట్లా మాట్లాడటం తప్పు" అన్న మాటలతో మళ్ళీ ఈ ప్రపంచంలోకి వచ్చి పడ్డాను. యెదురుగా లాగూ శేర్వానీతో నెత్తిమీదవున్న కుచ్చు కుళ్ళాయీని సవరించి జనగామా దొరవారు ప్రత్యక్షం. తన సలాం నందుకోవడానికి నా దృష్టి నాకర్షించాలని గొంతు సరాయిస్తూ నావైపూ, కటికె వాళ్ళదిక్కూ మార్చి మార్చి చూస్తున్నాడు.

"వాళ్ళేమీ అబద్ధం చెప్పడంలేదు. ఇది చాలా సీరియస్‌గా ఆలోచించవలసిన వ్యవహారం. వాళ్ళను పొమ్మనండి" అన్నాను.

నా ఆలోచన పసిగట్టారు లాగుంది. "చిత్తం, చిత్తం. వాళ్ళేం అబద్ధం చెప్పడంలేదు. వాళ్ళ కష్టాలు వాళ్ళకున్నాయి – యేలినవారు కాకపోతే యింకెవరాలోచిస్తారు." అంతదాకా కటికె వాళ్ళకు నచ్చజెప్పడానికి నయానా భయానా తామేమీ ప్రయత్నం చేయలేదన్నట్లుగా ప్లేటు ఫిరాయించారు. అధికారమనే చెట్టునీడ ఏ దిక్కుకు పారితే వీళ్ళుకూడా అటే పాకుతూ వుంటారు. అలా రాత్రింబగళ్ళు ప్రదక్షణాలు చేయడంలోనే ఇహపరాలు రెంటినీ సాధించుకోగల దిట్టమైన గట్టిప్పలు.

# 3

ఇది కమేటీల రాజ్యం. మనం తల్చుకున్నదే చేసి పారేస్తాం – కాని దానికి పదిమంది ఆమోదముద్ర వున్నట్లు చూయించుకోవాలి – బాగైతే ఆ పరపతి మనకు దక్కుతుందీ బాగుండదూ, ఆ పీడ కమేటీ మీది నుంచి పోతుంది. అందుకే బాగా ఆలోచించి ఈ కమేటీల పద్ధతి పెట్టారేమొ సర్కారువారు. లేకుంటే ఈ రెండో ప్రపంచ యుద్ధం రేపెట్టిన సమస్యలు ఒకనాటికి తేలేవా ? పాడా ? అవి ఒకటా ? రెండా ? సవాలక్షలు.

కమేటీలో సభ్యత్వమంటే కొంతమందికి మాచెడ్డ మోజు. అధికార్లతోబాటు కూచోవచ్చు. కమేటీ మీటింగుల పేర వాళ్ళ యిళ్ళచుట్టూ ప్రదక్షణాలు చేయొచ్చు. ఇది పలుకుబడి పెరగడానికి ప్రధానమైన

సోపానం. నరకంలో కమెటీ లేస్తున్నామంటే నాకో సీటు, అని పైరవీ చేసుకొనే బాపతు పెత్తందారులూ, పట్నవాసం వ్యాపారస్తులూ, వకీళ్ళూ కంట్రాక్టర్లూ చాలామంది వున్నారు. వీళ్ళంతా పరిపాలనకు తామే మూలస్తంభాలైనట్లుగా మురిసిపోతుంటారు. ప్రజలనుండి, ప్రజలచేత, ప్రజలకొరకు ఇలాంటి కమెటీలు యెన్నుకోబడాలని కొందరంటారు. కాని ఇది పడమటి దేశాల డెమాక్రసీ. నా విష్ణుఃపృధివీపతే అనే తూర్పుదేశాల కది పనికి రాదు. అచ్చిరాదు. మన హైద్రాబాద్ రాజ్యంలోనైతే దాని వాసనే గిట్టదు. బతకనుగూడా బతుకదు కనక చిలకపలుకులా గుడ్డిగా అనుకరించ గూడదని అరవిందయోగి శిష్యులు చచ్చి స్వర్గానికిబోయిన మన ప్రధానమంత్రి సర్ అక్బర్ హైదరీగారు శలవిచ్చారు. శ్రీమాన్ రాజాజీ సర్టిఫికేటిచ్చారు. మన ఘనత వహించిన ప్రభువుగారికి లక్షరూపాయిల విరాళం ముట్టినాక మాత్రమే సుమండీ – ఆంధ్ర తెలంగాణాలు రెంటికీ ఛాన్సలర్‌గా మన ప్రభువుగారే కూడా. కాంగ్రెసు నాయకులే దేవుళ్ళను ప్రార్థించారు. ఇదంతా అవసరం లేని వెధవ డెమాక్రసీ గొడవ. అసలు మన కథ ఎక్కడుందంటే —

సమస్యా పరిష్కారానికి వేసిన ఫుడ్ కమెటీని పిలవాల్సిందని దేరా క్లర్కుకు చెప్పాను. అసలు మాంసం కంట్రోలు ధరేమిటో వెదికి తియ్యమన్నాను. అసలలాంటి దొకటి వున్నట్లుగా నాకుగూడా తెలియదు. అన్ని కాయితాలతోపాటు చూడకుండా చిన్నదో పెద్దదో సంతకం పారేసి వుంటాను. తల వెంట్రుకలన్ని ఆర్డర్సు హైదరాబాద్ డిఫెన్సు రూల్సు కింద. ఇవాళొకటీ రేపొకటి. మొన్నటి ఆర్డరుకు నిన్న సవరణ. అసలు ఆ శాఖ సెక్రటరీనిగూడా అమాంతం అడిగితే గుడ్లు తేలేస్తాడు. ఫలాని ఆర్డరేమిటంటే చెప్పలేడు.

పిలిచిన కమిటీ ప్రారంభమైంది – మాంసం మాట్లా ఇది మాత్రం మాకు అంతుబట్టే విషయం కాదన్నారు షాహుకార్ల ప్రతినిధులు.

నష్టమైతే అయింది వ్యాపారం చేయమంటాం–బాగా సంఘాయించి హడ్తాలాపిస్తామన్నారు పోలీసు అధికార్లు – వాళ్ళకు గూడా రెవిన్యూ అధికార్లతోబాటు ప్రతి కమిటీలో మెంబర్‌షిప్ వుండాల్సిందే – అడ్మిని

స్టేషన్‌కు అమ్మమ్మ నాయనమ్మలాంటి పోలీసు డిపార్టుమెంటు, రెవిన్యూ డిపార్టుమెంట్సు అధికారులులేనిది ప్రభుత్వం ఒక్కడుగ్గూడా కదలలేదు.

"సర్కారు మీరెట్లనన్నా చేయండి – కసాయీలకు జంతువుల నిప్పించండి. వాళ్ళ బేరం సాగుతుంది. ప్రజలకు మాంసం దొరుకుతుంది– మీ పేరు యెల్లకాలం మా జిల్లావాసులు తలుచుకుంటారు. మీ కుటుంబం చిటకొటారుగా వృద్ధిపొందాలనీ, పెద్ద నౌకరీలదాకా మీ అదృష్టం ప్రయాణించాలనీ దేవుణ్ణి ప్రార్థిస్తాం" అన్నాడు ఒక వకీలు మెంబరు.

"అదెంతపని మీరాజ్ఞయిస్తే చాలు – జంతువుల ఒనాభా లెక్కల రిజిష్టర్ ప్రకారం అన్ని గొర్లనూ మేకలనూ హాజరు చేయిస్తాం – డబ్బు వెంటనే ఇవ్వాల్సిన బాధేమీలేదు – హుజూరువారికి మాంసం లేక ముద్ద దిగలేదని తెలిసిన మాకు చాలా బాధ కలిగింది" సాయంత్రం డిన్నర్‌కు ముందే అన్నంతపని చేస్తామన్నారు రెవిన్యూ ప్రతినిధులు.

బాగుందంటే బాగుందన్నారు. పై సూచన లన్నీ తక్షణం అమలు జరగాల్సిందేనన్నారు గుత్తేదార్ల, కంట్రాక్టర్ల ప్రతినిధులు. లేకుంటే ప్రజలాచుకోరు. కసాయివాళ్ళ ఖర్మం మూడుతుంది. శాంతి భద్రతలు ఖరాబై పోతాయన్నారు.

ఇవన్నీ విన్నాక సమస్య అర్థమైచచ్చిందేమో సాహుకారు లేచాడు. నాదో మనవి వుందని యేదో చెప్పబోతున్నాడు. టైమైపోయిందని గడియారం చూచుకొంటున్న గుత్తేదారు, సాహుకారు కోటుకొంగుబట్టి గుంజుతున్నాడు కూచొమ్మన్నట్లుగా. మీరంతా మాట్లాడగా లేనిది వ్యాపార విషయం నేను మాట్లాడొద్దా అంటున్నాడు సాహుకారు.

చెప్పవలసిందేదో త్వరగా చెప్పమన్నాను. గ్రహణం బట్టినట్లుగా సాహుకారునుబట్టి గుంజబోతున్న గుత్తేదారు వదిలేశాడు. నా ఇంగితాన్ని కనిపెట్టినట్లున్నాడు. మధ్యలో యే జోక్యం కలిగించుకోలేదు. తక్కిన వాళ్ళంతా ఓపికగా వింటున్నట్లు నటిస్తున్నారు. కునికిపాట్లుపడేవారు పడుతూనే వున్నారు.

సాహుకారి వాగ్ధోరణి సాగింది.

"సర్కార్ నన్ను ఖుష్ చెయ్యాలి. యేదో వ్యాపారస్తుణ్ణి – నాకు దోచినది నేను విన్నవించుకొంటాను. ఆలించినా పాలించినా అంతా మీ చేతిలోనే వున్నది. మా తండ్రి తాతల నాటినుండి సర్కారు కమెటీల్లో మెంబర్లుగా వుంటున్నాం. ఏదో మీవంటి పెద్దల దయతో యే మంత్రి వచ్చినా ప్రధాని వచ్చినా ఈ వకీళ్ళు, గుత్తేదార్లూ అధికార్లతో బాటు మెడల్సూ నగదులూ సర్టిఫికెట్లూ ఇచ్చిపోయారు. అద్దాలు గట్టించి వాటి నన్నిటిని దేవునర్రలో భద్రం చేయించాను. పోలీసు సాబులూ మాల్ (రెవిన్యూ) సాబులూ చెప్పినట్లు కటికవాళ్ళతో పని చేయించే బాధ్యత వాళ్ళ కొప్పగిస్తే అనుభవజ్ఞులు వారా పని బాగా చేయగలరు. వకీలుసాబులు చెప్పినట్లు సరుకులేని వ్యాపారం యెట్లా సాగుతుంది. సరుకు వచ్చేది మాల్, పోలీసు సాబులు చూచుకుంటారు. కాని ఒక్క సంగతి – ఇదివరకు సర్కారుకు అవసరమైన సరుకుకు డబ్బిచ్చే అలవాటు లేదు. అడిగే మర్యాద కూడా లేదు. వివిధ సరుకుల వ్యాపారంలో ఒక దాని నష్టం యింకో సరుకు మీద పూడేది. కనుక యెవరికేమీ అనిపించలేదు. కాని గొల్లవాళ్ళది ఒకటే సరుకు వ్యాపారం. ఇంతో అంతో ధర యిచ్చే యేర్పాటు చేయకపోతే వాళ్ళేడిచిపోతారు."

నీళ్ళ నములుతూ పాము చావకుండా కట్టె విరగకుండా ఈ చాదస్తుడు చెప్పే సోదితో విసుగుబుట్టి అసలు సంగతి చెప్పమన్నాను.

సర్కారు కింకా వేరే పనులున్నాయి. మాకు కూడా పనులున్నాయి పోవాలని తలకో మాట అంటున్నారు. మర్యాదకు చెప్పేదేదో త్వరగా పూర్తి చేయమన్నాను. మళ్ళీ అందుకున్నాడు సాహుకారు:

"గొల్లవాళ్ళకు డబ్బివ్వకపోతే సర్కారు వ్యతిరేకుల సంగం వాళ్ళకు సందు దొరుకుతుంది. బదనాం చేస్తారు. ఇంత మంచి మనిషిని నామీద బ్లాక్‌మార్కెటు కేసు పెట్టారు. మీ అందరి దయవల్ల నాకేమీ కాలేదు. సంగం వాళ్ళపైనే కేసులు తయారై సజాలు (శిక్షలు) పడ్డయి. సళ్లా బిగువులు ఆలోచించి పని వెళ్ళదీసుకోవాలి. సర్కారుకు శత్రువు

లను పెంచుకో కూడదు. అన్నీ తెలిసిన మీవంటి వాళ్ళకు నేను చెప్పేదేమీ లేదు" అని కూచున్నాడు.

చెప్పేదేమీ లేదంటూ చెప్పాల్సినవీ చెప్పకూడనివీ అన్నీ చెప్పాడు సాహుకారు – నా పుణ్యానికి సరుకిచ్చావయ్యా'అని నిలదీశారు పోలీసు రెవిన్యూ ప్రతినిధులు – నేనేయేదో నోరుజారి అన్నాను. మీరంతా చాలమంచివాళ్ళు – "స్వర్గం లాంటిది మీ పరిపాలన" అంటూ పొగడ్తకు లంకించుకుంటున్నాడు సాహుకారు.

మొదట అలాయెందుకు మాట్లాడావు జవాబు చెప్పుకొమ్మన్నారు. అంతే. ఇక క్షమాపణ చెప్పుతున్నా వదిలేటట్లు లేరు మీటింగు మెంబర్లు. అర్థం చేసుకున్నాను – వెంటనే జోక్యం చేసుకొని మీ సూచనలన్నీ చాలా వున్నాయి. పై సర్కారుకు రిపోర్టు చేస్తాను అన్నాను – అబ్బే నా సూచన లేమీ లేవని గోలకెత్తాడు సాహుకారు – ఒకవేళ వుంటే ఉపసంహ రించుకొన్నట్లు రాయమన్నాడు. అలా యెట్లా వీలవుతుందనీ అంతుచూస్తా మన్నట్లు కొరకొరా చూస్తున్నారు పోలీసు మాత్ అధికార్లు – పిల్లికి చెలగాటం యెలుకకు ప్రాణ సంకటం – కావున మీటింగు ముగిసిందని ప్రకటించాను.

(1946)